ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

చిత్తూరు జిల్లా వార్తలు

సోమవారం 30 డిసెంబరు 2024







సెప్టెంబరు 13వ తేదీన బంగారుపాళ్యం మండలం మొగిలిఘాట్‌లో జరిగిన ప్రమాదంలో మృతులు



రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు, రవాణా శాఖలు సంయుక్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ 2023తో పోలిస్తే 2024లో రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. మరణాలు, క్షతగాత్రుల సంఖ్య కూడా ఎక్కువైంది. సాధారణ నేరాల సంఖ్య తగ్గినప్పటికీ దొంగతనాలు, దోపిడీలు స్వల్పంగా పెరిగాయి. సైబర్ నేరాలు తగ్గినా.. అగంతకులు దోచిన సొమ్ము గణనీయంగా పెరగడం ఆందోళన కలిగించే అంశం. - చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

# పెరిగిన ప్రమాదాలు




● ఆందోళనకరంగా సైబర్ నేరాలు

### ● మత్తు దందా కేసులు

నార్కోటిక్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు విభాగాలు మాదక ద్రవ్యాల రవాణా, వినియోగాలపై ముకుతాడు వేస్తున్నా.. కేసులు పెరుగుతూనే ఉన్నాయి. 131 మందిపై కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి 202 కిలోల గంజాయి, 83 కిలోల తడి గంజాయి ఆకులను సీజ్ చేసి 22 మందిపై కేసులు నమోదు చేశారు.

● ఎక్సైజ్ శాఖ వాళ్లు 1,486 కేసులు నమోదు చేసి 2,333 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 8,498 లీటర్ల సారా, 16,237 లీటర్ల అక్రమ మద్యం, 153 లీటర్ల బీరు, 56,143 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి 256 వాహనాలను సీజ్ చేశారు.

**రోడ్డు ప్రమాదాలు**

| సంవత్సరం | ప్రమాదాలు | మృతులు | క్షతగాత్రులు |
|---|---|---|---|
| 2021 | 735 | 324 | 805 |
| 2022 | 711 | 373 | 792 |
| 2023 | 703 | 351 | 854 |
| 2024 | 734 | 389 | 877 |

### ● మట్కా, ఆన్‌లైన్ గేమ్

ఈ ఏడాది మొత్తంలో జూదమాడుతున్న 1,224 మందిపై 201 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.56.95 లక్షలు, 96 సెల్ ఫోన్లు, 129 వాహనాలను సీజ్ చేశారు. అలాగే కోడిపుంజులతో పందెం ఆడే 86 మందిపై 22 కేసులు నమోదు చేసి రూ.2.18 లక్షలు, 18 కోడిపుంజులు, 17 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు.

● క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసి రూ.87వేలు, ఎనిమిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

● పేలుడు పదార్థాల కింద 57 మందిపై కేసులు నమోదు చేసి వారి వద్ద ఉన్న 490 గ్రాముల నల్లమందును స్వాధీనం చేసుకున్నారు.

### ● తగ్గిన హత్యలు, అత్యాచారాలు

జిల్లాలో గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది హత్యలు, అత్యాచారాలు, కిడ్నాపులు, ఇంటి దొంగతనాలు, చీటింగు కేసులు, సైబర్ కేసులు వంటివి తగ్గాయి. అలాగే హత్యాయత్నం, ఘర్షణలు వంటివి పెరిగాయి.

**తగ్గినవి**

| నేరాలు | 2023 | 2024 |
|---|---|---|
| హత్యలు | 44 | 24 |
| అత్యాచారాలు | 44 | 39 |
| కిడ్నాపులు | 25 | 21 |
| ఇంటి దొంగతనాలు | 124 | 88 |
| చీటింగ్ | 197 | 140 |
| దొంగతనాలు | 427 | 323 |
| సైబర్ కేసులు | 58 | 41 |

**పెరిగినవి**

| నేరాలు | 2023 | 2024 |
|---|---|---|
| హత్యాయత్నం | 55 | 67 |
| పగటి ఇంటి దొంగతనాలు | 31 | 39 |
| ఘర్షణలు | 13 | 16 |

### కోర్టు శిక్షలు

జిల్లాలో హత్యలు, అత్యాచారాలకు పాల్పడిన వారికి పోలీసు శాఖ శిక్ష పడే విధంగా చేసింది. ● 2014లో గుడుపల్లె పీఎస్ పరిధిలో ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడైన దేవరాజుకు కోర్టు 20 సంవత్సరాల శిక్ష విధించింది. ● ఈ ఏడాది జూలై 8న బైరెడ్డిపల్లె మండలంలో జరిగిన హత్య కేసులో నిందితుడు శ్రీనివాసులుకు కోర్టు జీవిత ఖైదు విధించింది. ● 2017లో సోమల మండలంలో వెంకటసిద్ధులు (67) అనే వృద్ధుడిని హత్య చేసిన సుధాకర్‌కు మదనపల్లె కోర్టు జీవిత ఖైదు విధించింది.



### చాట్ బాట్‌తో 2,085 ఫోన్ల రికవరీ

జిల్లాలో 3వేల మంది ఫోన్లను పోగొట్టుకున్నారు. దశల వారీగా చాట్ బాట్ బృందం సాంకేతికతను వినియోగించి తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రల నుంచి 4.46 కోట్ల విలువైన 2,085 ఫోన్లను రికవరీ చేసి.. పోగొట్టుకున్న వారికి అందించింది.

### డయల్ 100కు 11,559 ఫిర్యాదులు

ఈ ఏడాది డయల్ 100కు మొత్తం 11,559 ఫిర్యాదులు అందాయి, వీటిలో కిడ్నాప్, హత్యాయత్నం, ఆత్మహత్యలు, కుటుంబ సభ్యుల తగాదాలు, ఆస్తి నేరాలు, పేకాట, ఇసుక అక్రమ రవాణా, రోడ్డు, అగ్ని ప్రమాదాలకు సంబంధించిన ఫిర్యాదులున్నాయి. 254 ఫిర్యాదులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

### 24 బ్లాక్ స్పాట్ల గుర్తింపు

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల్లో భాగంగా 24 బ్లాక్ స్పాట్లను గుర్తించారు. అన్ని మున్సిపాలిటీల్లోనూ సమస్యాత్మక జంక్షన్లు, స్కూల్ జోన్లు, కాలేజీలు, హాస్పిటల్స్ వద్ద స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్, రంబుల్‌స్టిక్స్ ఏర్పాటు చేయనున్నారు.

## ప్రధాన సంఘటనలు..

● **15 మే:** బంగారుపాళ్యం మండలం మొగిలి ఘాట్ వద్ద జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్, రెండు లారీలు ఢీకొన్ని ముగ్గురు మృతి చెందారు. మరో నలుగురికి గాయాలయ్యాయి.

● **23 జూలై:** బంగారుపాళ్యం టోల్‌గేట్ వద్ద ఇద్దరు ట్రావెల్ బస్సుల డ్రైవర్ల మధ్య ఘర్షణ జరిగితే.. మార్నింగ్ స్టార్ ట్రావెల్ బస్సు డ్రైవర్ సుధాకర్‌రాజు మీదకి శ్రీకృష్ణ ట్రావెల్ బస్సు డ్రైవర్ శ్రీనివాసరావు తొక్కించుకుంటూ వెళ్లాడు. దీంతో గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన సుధాకర్‌రాజు అక్కడికక్కడే మృతి చెందారు.

● **13 సెప్టెంబరు:** మొగిలి ఘాట్‌లో ఆర్టీసీ బస్సును ఎదురుగా ఇనుప కమ్మీల ట్రక్కు, వెనుక నుంచి లారీ ఢీకొనడంతో 8 మంది మృతి చెందారు. 31 మంది తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇదే పెద్దది.

● **20 సెప్టెంబరు:** బెంగళూరు వాసులు కంచికి చీరల కోసం వెళ్తుండగా.. బంగారుపాళ్యం మండలం కొత్తపల్లె ఫ్లైఓవర్‌పై వారు ప్రయాణించే కారు టైరు పగిలిపోయి రక్షణగోడకు ఢీకొంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించారు.



ఆస్పియా (ఫైల్ ఫొటో)


● **అక్టోబరు 2:** పుంగనూరులోని ఉబేదుల్లా కాంపౌండ్‌లో అదృశ్యమైన ఏడేళ్ల బాలిక ఆస్పియా పట్టణ సమీపంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో శవమై కనిపించింది. డీఐజీ పర్యవేక్షణలో ఎస్పీ మణికంఠ బృందం పుంగనూరులోనే మకాం వేసిన చిన్నారిని కాపాడుకోలేకపోయారు. చిన్నారి తండ్రితో వివాదమున్న అదే వీధికి చెందిన ఓ మహిళ ఈ ఉదంతానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

● **జూలై 14:** స్నేహితుడి జన్మదినం కోసం కాణిపాకం నుంచి బైక్‌పై కేక్ తీసుకొస్తుండగా.. చెర్లోపల్లె సమీపంలో మినీలారీని బైక్ ఢీకొట్టింది. బంగారుపాళ్యం మండలం మహాసముద్రం గ్రామానికి చెందిన ముగ్గురు స్నేహితులు పవన్, మంజు, చరణ్ మృతి చెందారు.

● **నవంబరు 28:** చిత్తూరు దుర్గానగర్ సమీపంలో రోసీనగర్‌లో నివాసముంటున్న వసంతమ్మ (63)ను కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆమె పెద్ద కొడుకు శంకర్ మద్యం మత్తులో చంపేశాడు. కాలితో తన్నడంతో పక్కటెముకలు విరిగిపోయాయి. తలను గోడకేసి కొట్టడంతో మెదడులో రక్తం గడ్డకట్టి అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమె మృత్యువుతో పోరాడుతూ మరణించారు.

● **డిసెంబరు 8:** పాకాల మండలం కుక్కలపల్లెకు చెందిన సాయికుమార్, అభిలాష్, బావాజాన్‌లు అమర్‌రాజా గ్రోత్ కారిడార్‌లో పనిచేస్తూ.. విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా.. కడప నుంచి చిత్తూరు వైపు వెళుతున్న ఐషర్ వాహనం వేగంగా ఢీకొంది. సాయికుమార్, అభిలాష్‌లు అక్కడికక్కడే మృతి చెందగా.. బావాజాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

● **డిసెంబరు 23:** తన భార్యను సచివాలయ ఉద్యోగి ట్రాప్ చేశాడని పెనుమూరుకు చెందిన మోహన్‌ఆచారి అనే వ్యక్తి సెల్ఫీ వీడియో రికార్డు చేసి ఆత్మహత్య చేసుకున్నారు. సచివాలయ ఉద్యోగి సురేంద్రను కలెక్టర్ సస్పెండ్ చేశారు.




● **అక్టోబరు 4:** జీడీనెల్లూరు మండలం ఎగవూరు గ్రామానికి చెందిన నాగరాజులరెడ్డి కుమారుడు దినేష్ ఆన్‌లైన్ బెట్టింగులతో డబ్బులు పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడు. అప్పుల బాధలు తట్టుకోలేక ఈ ఏడాది అక్టోబరు 4వ తేదీన కుటుంబ సభ్యులంతా కలిసి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కుటుంబ పెద్ద నాగరాజులరెడ్డి (61), ఆయన సతీమణి జయంతి (50), కుమార్తె సునీత (26), కుమారుడు దినేష్ (22) తమిళనాడులోని రాణిపేట సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నాలుగు రోజుల వ్యవధిలో ఒక్కొక్కరుగా మరణించారు.

# జిల్లా పదవుల భర్తీ ఎన్నడో..?

● ఖాళీగా పది మార్కెట్ కమిటీలు

● 6నెలలుగా ఆలయ కమిటీలదీ అదే పరిస్థితి

చిత్తూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల్ని రెండు విడతల్లో భర్తీ చేసిన కూటమి ప్రభుత్వం జిల్లా స్థాయి పోస్టుల భర్తీపై ఇంకా దృష్టి సారించలేదు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైపోయినా ఇంకా ఆ ప్రస్తావన లేకపోవడంతో పదవులు ఆశించినవారు కాస్త అసంతృప్తిలో ఉన్నారు.


**ఆ రెండు పదవులకు మరో ఆరునెలలు**

● జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఉమ్మడి జిల్లా వారీగా పనిచేస్తున్నాయి. వైసీపీ హయాంలో ఈ రెండింటికి ఆ పార్టీ నాయకుల్ని నామినేట్ చేశారు. కూటమి వచ్చాక చిత్తూరు జాయింట్ కలెక్టర్‌ను పర్సన్ ఇన్‌చార్జిగా నియమించారు. డీసీఎంఎస్‌కు, డీసీసీబీకి పర్సన్ ఇన్‌చార్జి పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చేసింది. దీంతో ఆశలు పెట్టుకున్న కూటమి నాయకులు నిరాశే మిగిలిందని చెప్పవచ్చు.

● జిల్లా కేంద్రంలోని చుడా చైర్మన్ పోస్టును ఆ మధ్య కటారి హేమలతకు ఇచ్చారు. ఇటీవల సాగునీటి సంఘం ఎన్నికల్ని జరిపించగా.. సుమారు 216 సంఘాలకు చైర్మన్లు, వైస్ చైర్మన్లు నియామకమయ్యారు. కానీ, ఈ సాగునీటి సంఘాల పదవులు చెప్పుకోదగినవి కావు. జిల్లా గ్రంథాలయ సంస్థ, కోఆపరేటివ్ ప్రింటింగ్ ప్రెస్, టౌన్ బ్యాంకు చైర్మన్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. దగ్గర్లో వీటిని భర్తీ చేసే అవకాశాలు కనిపించడం లేదు.

● జిల్లాలో పది మార్కెట్ కమిటీలున్నాయి. ఈ పదవులను ఎన్నికల్లో కష్టపడిన నాయకులు ఆశిస్తున్నారు. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేల సిఫారసు లెటర్లను చేతపట్టుకుని తిరుగుతున్నారు. తాజాగా మార్కెట్ కమిటీల నియామకానికి రిజర్వేషన్లు ఖరారు చేయాలని ప్రభుత్వం నుంచి కలెక్టర్‌కు ఆదేశాలు వచ్చాయి. ఈ ప్రక్రియ మన జిల్లాలో పూర్తయ్యాక భర్తీ గురించి ఆలోచిస్తారు.

● సుప్రసిద్ధ కాణిపాక వరసిద్ధుడి ఆలయం, బోయకొండ గంగమ్మ ఆలయాలతోపాటు అర్ధగిరి, వేపంజేరి వంటి మరిన్ని చెప్పుకోదగ్గ ఆలయాలు జిల్లాలో ఉన్నాయి. వీటన్నిటికీ పాలకవర్గాలను నియమించాల్సి ఉంది. కాణిపాకంలో బ్రహ్మోత్సవాల సమయంలో పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తారని ఆశావహులు భావించినా అది సాధ్యమవ్వలేదు.



# కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు.

**జిల్లా పోలీసు కార్యాలయంలోనూ..**

జిల్లా పోలీసు(పాత) కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

## తగ్గిన టమోటా ధరలు

● 15 కిలోల బాక్స్ రూ.100లోపే..
● కన్నీరు పెడుతున్న రైతులు



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా టమోటాలు

సోమల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు తగ్గిపోవడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. ఆదివారం 15 కిలోల టమోటా బాక్స్ రూ.వం దకులోపు పడిపోయింది. నాణ్యత లేని రెండో రకం కాయలు మార్కెట్‌లో అమ్ముడుపోవడం లేదని పశువులకు మేతగా వేయాల్సి వస్తుందని రైతులు వాపోయారు. ఈ ఏడాది జూన్- ఆగస్టు నెలల్లో 15 కిలోల బాక్స్ రూ.వెయ్యి దాటింది. సోమల మండలంలో 400 ఎకరాల్లో టమోటా సాగు చేశారు. సెప్టెంబరులో నాట్లు వేసిన రైతులకు ప్రస్తుతం దిగుబడులు వస్తున్నాయి. ఎకరా సాగుకు రూ.1.50 లక్షల ఖర్చు దాటింది. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. ఉన్న పంటకు చీడపీడలు సోకాయి. అరకొరగా ఉన్న పంటను మార్కెట్‌కు తరలిస్తే రవాణా ఖర్చులు సైతం రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు చేతి నుంచి చెల్లించాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

## ఆస్తి కోసం కన్నతల్లిపై కుమారుడి దాడి

### పుంగనూరు పోలీసులకు తల్లి ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన తల్లి శశికళ

పుంగనూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి జన్మనిచ్చిన తల్లినే ఆస్తి కోసం కుమారుడు కొట్టి ఇంటి నుంచి బయటకు గెంటేసిన సంఘటన శనివారం రాత్రి పుంగనూరు మండలంలో వెలుగుచూసింది. బాధితురాలి కథనం మేరకు.. పుంగనూరు మండలం గుడిసిబండ పంచాయతీ భైనిగాని పల్లెకు చెందిన శేఖర్ భార్య ఎస్.శశికళ (65)కు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వృద్ధురాలైన శశికళకు గ్రామంలో మూడు ఇళ్లు ఉండగా.. రెండు ఇళ్లు కుమారుడు నాగరాజుకు ఇచ్చి మరో ఇంట్లో ఆమె కాపురం ఉంటోంది. వృద్ధాప్యంలో ప్రభుత్వం ఇచ్చే పింఛను, కూలీ పనులతో వచ్చే డబ్బుతో జీవిస్తోంది. కొంతకాలంగా కుమారుడు నాగరాజు, అతని భార్య సంధ్య, మనవరాలు మానూషా తాను కాపురం ఉన్న ఇంటిని ఖాళీ చేసి ఎక్కడికైనా వెళ్లిపోవాలని వేధిస్తున్నట్లు వాపోయారు. తనపై దాడి చేసి అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకు పంపేశారని పోలీసుల ఎదుట వాపోయింది. గతంలోనూ తన కొడుకు, కోడలు కొట్టినట్లు బోరున విలపించారు. పోలీసులు న్యాయం చేయాలని కోరారు. విచారించి చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసులు తెలిపారు.

## వరసిద్ధుడి సేవలో ఎస్బీఐ చైర్మన్



చైర్మన్‌కు జ్ఞాపికను అందిస్తున్న సూపరింటెండెంట్ వాసు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎస్బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టి కాణిపాక వరసిద్ధుడిని ఆదివారం రాత్రి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయన్ను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసు అభ్యర్థుల ఫిజికల్ టెస్టుపై ట్రయల్ రన్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల ఫిజికల్ మెజర్మెంట్, ఎఫిషియన్సీ పరీక్షలు సోమవారం నుంచి వచ్చేనెల 10వ తేదీ వరకు పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లోని పరేడ్ మైదానంలో జరగనున్నాయి. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ ప్రక్రియను ఆదివారం ఎస్పీ మణికంఠ ముందస్తుగా పరిశీలించి ట్రయల్ రన్‌ను నిర్వహించారు. స్టేట్‌లెవల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేశామన్నారు. బయోమెట్రిక్ అథెంటిఫికేషన్, ఫిజికల్ మెజర్మెంట్, ఆర్ఎఫ్ఐడీ ట్యాగుల పంపిణీ, ఫిజికల్ ఎఫిషియన్సీలో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్ ట్రాక్‌లను పరిశీలించారు. పోలీసు అధికారులకు, సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. పోలీసు రిక్రూట్‌మెంట్ పకడ్బందీగా జరుగుతుందని, దళారులను నమ్మి మోసపోవద్దని అభ్యర్థులు, వారి తల్లిదండ్రులకు సూచించారు.

## మరోసారి పక్షుల పండుగ తేదీల మార్పు!

తడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ తేదీలు మరోసారి మారే సూచనలు కనబడుతున్నాయి. నాలుగేళ్ల తర్వాత సూళ్లూరుపేట కేంద్రంగా పక్షుల పండుగ నిర్వహించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఆ మేరకు ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు జిల్లా అధికార యంత్రాంగంకు అందాయి. మొదట పక్షుల పండుగను జనవరి 10, 11, 12 తేదీలలో నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. సమయం తక్కువగా ఉండటంతో ఆ తేదీలను జనవరి 17, 18, 19 తేదీలకు మార్చారు. ఆమేరకు అధికారులు ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. సంక్రాంతి పండుగ, నాయుడుపేటలో మూడు రోజులపాటు ఏటి పండుగ అవే రోజుల్లో జరగనున్నాయి. ఈ క్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆ తేదీలను మార్చే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్‌కు తేదీల మార్పును సూచించినట్లుగా తెలుస్తుంది. పండగ తేదీలలో పాఠశాలలకు సెలవుదినాలు కావడంతో ఊర్లకు వెళ్లిన విద్యార్థులు పక్షుల పండుగను వీక్షించే అవకాశం ఉండదు. ఈ క్రమంలో తేదీల మార్పును ప్రతిపాదించామని, అందరికీ అనుకూలమైన తేదీలలోనే పక్షుల పండుగ నిర్వహిస్తామని ఆదివారం ఎమ్మెల్యే విజయశ్రీ మీడియాకు తెలిపారు.

## కమ్ముకున్న పొగ మంచు..!



సదుం మండలంలో ఆదివారం పొగ మంచు కమ్ముకుంది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం 9 గంటల వరకు పొగ మంచు కురుస్తూనే ఉంది. వాహనచోదకులు లైట్లు వేసుకుని ప్రయాణించాల్సి వచ్చింది. దట్టమైన పొగమంచుతో పూత దశలో ఉన్న మామిడి పంటకు నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. - సదుం

## అరుదైన సీతా కోక చిలుక



సాధారణంగా రెండు రెక్కలతో సీతాకోకచిలుకను చూశాం. అయితే నాలుగు రెక్కలు ఉన్న సీతాకోకచిలుక కనిపించడం చాలా అరుదు. ఆదివారం స్థానిక కాలేజీ రోడ్డులో చక్కర్లు కొడుతూ సీతాకోకచిలుక చూపర్లను ఆకట్టుకుంది. - సదుం

## ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని 2025 జనవరి ఒకటో తేదీన ఇవ్వాల్సిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు ఒక్క రోజు ముందుగా మంగళవారం ఇవ్వనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. జిల్లాలోని 2,67,240 మంది పింఛన్‌దారులకు సంబంధించి రూ.113.49 కోట్లు నిధులు జిల్లాకు వచ్చాయన్నారు. ఉదయం ఆరు గంటలకు పింఛన్ పంపిణీ ప్రారంభించి కేవలం నాలుగు గంటల్లో పూర్తి చేసేందుకు ఆదేశాలు ఇచ్చామన్నారు. రెండు నెలలుగా పింఛన్ తీసుకోని వారికి జనవరి నెల పింఛన్‌తో కలిపి మూడు నెలల పింఛన్ సొమ్ము ఇవ్వనున్నట్లు తెలిపారు. నవంబరు నెలలో జీవిత భాగస్వామి మరణించిన 236 మందికి జనవరి నెలలో కొత్త పింఛన్ మంజూరు చేసినట్లు తెలిపారు. వివిధ కారణాలతో మంగళవారం పింఛన్ తీసుకోని వారికి జనవరి 2న అందజేయనున్నట్లు చెప్పారు.

# కుప్పం అడవిలో దొంగలు పడ్డారు!

● టన్నులకొద్దీ కలప కర్ణాటకకు స్మగ్లింగ్
● లక్షల విలువైన 45 టన్నుల స్వాధీనం



ట్రాక్టర్‌లో నిండుగా ఉన్న కలప

కుప్పం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుప్పం అడవిలో దొంగలు పడ్డారు. టన్నులకొద్దీ కలపను దోచుకెళ్తున్నారు. కుప్పం నియోజకవర్గానికి అత్యంత సమీపంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు ఉన్నాయి. ఈ మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో వేల ఎకరాల అడవులు విస్తరించి ఉన్నాయి. లోతట్టు అటవీ ప్రాంతాలే కాక, ప్రభుత్వాలు కొండలు, కోనల్లో పెంచిన అకేషియా, యూకలిప్టస్ వృక్షాలు కూడా వేల ఎకరాల్లో కనిపిస్తాయి. ఈ అడవులనుంచి యథేచ్ఛగా కలప అక్రమ రవాణా జరుగుతున్నట్లు అటవీశాఖ అధికారులకు సమాచారమందింది. జిల్లా అధికారుల ఆదేశాలతో కుప్పం అటవీ శాఖాధికారి జయశంకర్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల పరిధిలోని అడవుల్లో శుక్ర, శనివారాల్లో మెరుపు దాడులు చేశారు. వివిధ ప్రాంతాల్లో కలపను దుంగలుగా లోడ్ చేసి రవాణాకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లను గుర్తించారు. ఒక ఖాళీ ట్రాక్టర్‌తోపాటు కలపతో నిండుగా ఉన్న ఏడు ట్రాక్టర్లను సీజ్ చేసి, కుప్పంలోని అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. ఒక్కో ట్రాక్టర్‌లో సుమారు 4 టన్నుల నుంచి 6 టన్నుల కలప ఉన్నట్లు తెలుస్తోంది. ఏడు ట్రాక్టర్లలో కలిపి దాదాపు 30 టన్నుల నుంచి 45 టన్నుల దాకా ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో స్వాధీనం చేసుకున్న కలపను కుప్పం అటవీ శాఖ కార్యాలయంలో ఉంచేశారు. ట్రాక్టర్ల డ్రైవర్లను కూడా పట్టుకున్నారు. సోమవారం జిల్లా అటవీ శాఖాధికారులు కుప్పం వచ్చి కలప బరువు తూచి, ట్రాక్టర్ యజమానులకు జరిమానాలు విధిస్తారని అధికారులు చెబుతున్నారు.

**కర్ణాటకకు స్మగ్లింగ్**

కుప్పం అటవీ శాఖాధికారుల దాడుల్లో పట్టుబడిన కలప దుంగలుగా తయారు చేసి ఉంది. కొంత భాగం పచ్చిగానే ఉన్నా, మిగిలినది బాగా ఆరి విక్రయానికి సిద్ధంగా ఉంచారు. యూకలిప్టస్, అకేషియాతోపాటు కానుగ, చింత, మర్రి, వేప దుంగలు కూడా సీజ్ చేసిన కలపలో ఉన్నాయి. ఈ కలపను కర్ణాటక రాష్ట్ర పరిధిలోని కెంపాపురం, బెళ్లకోగిల తదితర ప్రాంతాల్లోని డిపోలకు తరలించడానికి స్మగ్లర్లు సిద్ధం చేశారు. చివరి నిమిషంలో అటవీ శాఖాధికారుల దాడులవల్ల వారి ప్రయత్నాలు ఫలించలేదు.

**లక్షల్లో వ్యాపారం**

కుప్పం నియోజకవర్గ అటవీ ప్రాంతంలో నిత్యం భారీ సంఖ్యలో వృక్షాలు నేలకొరుగుతున్నాయి. ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటకలకు చెందిన కొంతమంది అంతర్రాష్ట్ర ముఠాగా ఏర్పడి.. అడవుల్లో నరికిన కలపను దుంగలుగా మార్చి.. ట్రాక్టర్లు, టిప్పర్లతో సరిహద్దులు దాటిస్తున్నారు. ఎక్కడికక్కడ మామూళ్ల దందా నడుస్తుండటంతో స్మగ్లర్లు బరితెగిస్తున్నారన్నది బహిరంగ రహస్యం. టేకు అయితే చదరపు అడుగు సుమారు రూ.4వేలు, అకేషియా రూ.5వేల ధర పలుకుతోంది. యూకలిప్టస్ కలప అయితే టన్ను ధర రూ.7వేలకుపైగా పలుకుతోంది. కానుగ, వేప, చింత వంటి ఇతర జాతుల కలప టన్ను రూ.3వేలనుంచి రూ.5వేలదాకా ఉంటోంది. అయితే ఈ ధరలన్నీ ఏపీనుంచి కర్ణాటక, తమిళనాడు డిపోలకు చేరేదాకా మాత్రమే. అక్కడినుంచి పేపరు మిల్లులు, ఇతరత్రా రాష్ట్రాల్లోని ప్రధానమైన డిపోలకు తరలిపోయేసరికి టన్ను కలప ధర జాతులను బట్టి తక్కువలో తక్కువ రూ.10వేల నుంచి రూ.25 వేలదాకా పెరుగుతోంది. ఈ లెక్కన కుప్పంనుంచి కర్ణాటకకు స్మగ్లింగ్ అయ్యే కలప.. అటవీ దొంగలకు లక్షల్లో ఆదాయం మిగులుస్తోందన్న మాట.



కుప్పం అటవీశాఖ కార్యాలయంలో స్వాధీనం చేసుకున్న కలప ట్రాక్టర్లు

# షార్ @ 99

● నేటి ప్రయోగానికి పీఎస్ఎల్వీ-సీ 60 రాకెట్ సిద్ధం

షార్ నుంచి 99వ ప్రయోగం. పీఎస్ఎల్వీ ప్రయోగాల్లో ఇది 62వది. సోమవారం రాత్రి 9.58 గంటలకు పీఎస్ఎల్వీ-సీ 60 రాకెట్ ద్వారా స్పేస్ డాకింగ్‌కు చెందిన 440 కిలోల బరువు గల స్పాడెక్స్ జంట ఉపగ్రహాలను రోదసీలోకి పంపనున్నారు. ఇప్పటికే షార్‌లో పీఎస్ఎల్వీ ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ ఫెసిలిటీ (పీఐఎఫ్)లో రాకెట్ నాలుగు దశల అనుసంధాన పనులు పూర్తిచేసి మొదటి ప్రయోగ వేదిక వద్దకు తరలించారు. స్పాడెక్స్ జంట ఉపగ్రహాలను అనుసంధానించి అంతరిక్షయానానికి రాకెట్‌ను సిద్ధం చేశారు. ఆదివారం రాత్రి 8.58 గంటలకు కౌంట్‌డౌన్ మొదలైంది. కౌంట్‌డౌన్ జరిగే సమయంలో రాకెట్‌లోని రెండు, నాలుగు దశల్లో ద్రవ ఇంధనాన్ని నింపే ప్రక్రియను శాస్త్రవేత్తలు పూర్తి చేశారు. ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ ఆదివారం షార్‌కు చేరుకొని ప్రయోగ ఏర్పాట్లో నిమగ్నమయ్యారు. ప్రయోగ నేపథ్యంలో శ్రీహరికోట రాకెట్ కేంద్రం సందడిగా మారింది. మరోవైపు షార్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు. షార్ చుట్టుపక్కలతో పాటు సముద్ర మార్గాన కూడా జల్లెడపట్టి గాలిస్తున్నారు.



పీఐఎఫ్ భవనం నుంచి ప్రయోగ వేదికకు తరలుతున్న పీఎస్ఎల్వీ-సీ 60 రాకెట్





ప్రయోగ వేదికపై ఎగరడానికి సిద్ధంగా.. హీట్‌షీల్డ్‌లో అమర్చిన స్పాడెక్స్ ఉపగ్రహాలు

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

## భక్తులతో కిక్కిరిసిన బోయకొండ



ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిక్కిరిసింది. ఉదయాన్నే ఆలయ వేద పండితులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వర్ణాభరణాలు.. పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు

# ముగిసిన రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్‌పోటీలు

● విజేతలుగా బాలికల విభాగంలోచిత్తూరు, బాలుర విభాగంలో కృష్ణా జిల్లా జట్లు

యాదమరి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండల పరిధిలోని పీఈఎస్ పాఠశాలలో జరుగుతున్న 5వ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఫైనల్స్ రసవత్తరంగా సాగాయి. బాలికల విభాగంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు జయకేతనం ఎగురవేయగా, బాలుర విభాగంలో కృష్ణాజిల్లా జట్టు విజేతగా నిలిచాయి. బాలుర విభాగంలో.. ఫైనల్స్‌లో చిత్తూరు (పీఈఎస్ పబ్లిక్ పాఠశాల), గుడివాడ (మాంటిస్సోరి పాఠశాల) జట్లు తలపడ్డాయి. గుడివాడ (మాంటిస్సోరి పాఠశాల) జట్టు విన్నర్స్‌గా నిలవగా, చిత్తూరు (పీఈఎస్ పబ్లిక్ పాఠశాల)జట్టు విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచింది. చిత్తూరు (పీసీఆర్)జట్టు విద్యార్థులు మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బాలికల విభాగం ఫైనల్స్‌లో.. చిత్తూరు (బంగారుపాళ్యం సరోజిని స్కూల్), అనంతపూర్ (ధర్మవరం) జట్లు తలపడగా బంగారుపాళ్యం జట్టు విన్నర్స్‌గా, ధర్మవరం జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. చిత్తూరు (పీఈఎస్ పబ్లిక్ పాఠశాల) జట్టు విద్యార్థినులు మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.చెంగల్రాయ నాయుడు, కార్యదర్శి సురేష్, పీఈఎస్ విద్యాసంస్థల డైరెక్టర్ సత్యనారాయణ, డైరెక్టర్ కుమారస్వామి నాయుడు, ప్రిన్సిపాల్ వై.వి.కృష్ణబాబు, పీఈఎస్ పీఈటీలు అరవింద్, శశికుమార్, రెఫరీలు, పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.






విన్నర్స్ ట్రోఫీ కైవసం చేసుకున్న చిత్తూరు జిల్లా బాలికల జట్టు, బాలుర విభాగంలో రన్నర్స్‌గా నిలిచిన పీఈఎస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

# ముగిసిన తిరుపతి బాలోత్సవం

● రెండు రోజుల్లో 8,500 మంది హాజరు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నెహ్రూ మున్సిపల్ వేదికగా రెండు రోజులపాటు జరిగిన 'తిరుపతి బాలోత్సవం' ఆదివారం ముగిసింది. 163 ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లకు చెందిన 8,500 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి 30 అంశాల్లో, 70 విభాగాలుగా, 6 సమాంతర వేదికలపై పోటీలు నిర్వహించారు. 3, 4, 5 తరగతి విద్యార్థులను సబ్ జూనియర్స్‌గా, 6, 7 తరగతి విద్యార్థులను జూనియర్స్‌గా, 8, 9, 10వ తరగతి విద్యార్థులను సీనియర్లుగా విభజించి పోటీలు పెట్టారు. చిత్రలేఖనం, బొమ్మకు కథ రాయడం, వ్యాస రచన, ఉక్త లేఖనం, లేఖా రచన, దేశ, ప్రపంచ పటాలను రూపొందించడం, జ్ఞాపకశక్తికి పరీక్ష, చెత్తతో కళాకృతి తయారు, ఏకపాత్రాభినయం, క్లాసికల్, సోలో డ్యాన్స్, క్లాసికల్, సోలో సాంగ్, గ్రూప్ సాంగ్, జానపద పాటలు, దేశభక్తి పాటలు, పౌరాణిక నాటికలు, సంగీత వాయిద్యాల ప్రదర్శన, సంప్రదాయ వస్త్రధారణ, చదరంగం, పదకేళి తెలుగులో మాట్లాడటం, వక్తృత్వం, పద్యం-భావం, కథ చెబుతాను-ఊకొడతావా?, గణితం-తర్కం, మట్టితో బొమ్మల తయారీ, కోలాటం, యోగా, శాస్త్రీయ సంగీతం తదితర పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభ చూపారు. ఆదివారం సాయంత్రం జరిగిన ముగింపు సభలో విజేతలకు నిర్వాహకులు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను ప్రదానం చేశారు.



నాటకంలోని ఓ సన్నివేశం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



మట్టి బొమ్మల తయారీ పోటీల్లో చిన్నారి

## గ్రంథాలయాలు పాఠశాలలకు అనుసంధానం చేయాలి



వినతిపత్రం అందిస్తున్న తులసినాథం నాయుడు

పలమనేరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు పాఠశాలలకు అనుసంధానం చేయాలని రాష్ట్ర గ్రంథాలయాల అధ్యక్షులు గోనుగుంట్ల కోటేశ్వరరావుకు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసినాథం నాయుడు వినతి పత్రం అందించారు. ఆదివారం గుంటూరులో ఆయనను కలిసి గ్రంథాలయాల్లోని ఖాళీలను భర్తీచేయాలని, గ్రంథాలయాలలో తెలుగు భాషా పఠన పోటీలు నిరంతరం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం, చాణుక్యనాయుడు పాల్గొన్నారు. ఆరవ తెలుగు రచయితల ప్రపంచ మహాసభల్లో పి.తులసినాథం నాయుడును ఘనంగా సత్కరించారు.

## పాలమాకులపల్లిలో భగవద్గీత ప్రచారం



ప్రచారంలో ఇందూ జ్ఞానవేదిక సభ్యులు

పలమనేరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం కొలమాసనపల్లి, పాలమాకులపల్లి గ్రామాల్లో ఆదివారం భగవద్గీతపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్లు రచించిన ఈ పుస్తకాలలను త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక పలమనేరు, బంగారుపాళ్యం కమిటీ అధ్యక్షులు భాస్కర్, డి.బాలాజీ, సభులు జీవరత్న, వాణిశ్రీ, జ్యోతి, రెడ్డెమ్మ, హేమంత్ పాల్గొన్నారు.

## ఆశాజనకంగా ఉలవసాగు

పలమనేరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలంలో ఈ ఏడాది ఉలవ సాగు ఆశాజనకంగా ఉందని వ్యవసాయ శాఖ అధికారిణి సంధ్య తెలిపారు. మండలంలో రైతులకు ఈసారి దాదాపు 25 టన్నుల ఉలవలను సాగు కోసం పంపిణీ చేశారు. ప్రస్తుతం మండలంలో దాదాపు 495 హెక్టార్లలో ఉలవ సాగు చేశారని.. మరో నెలరోజుల్లో ఉలవ కోతకు వస్తుందని పేర్కొన్నారు. ఎకరాకు 12 కిలోల ఉలవ అవసరం అవుతుందని తెలిపారు. ఉలవ విత్తే సమయంలో విత్తనానికి కిలోకు 2 గ్రాముల చొప్పున కార్బండిజమ్ కలిపి విత్తాలని.. దీంతో వేరుకుళ్లు వంటి రోగాలు సోకకుండా ఉలవ పైరు ఆరోగ్యవంతంగా పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఉలవ విత్తనాలు వేసినప్పటి నుంచి తరచూ వర్షాలు కురుస్తున్నందున పంట బాగా పెరుగుతోందన్నారు. వాస్తవానికి ఈ ప్రాంతంలో కురిసే మంచుకే ఉలవ పంట బాగా దిగుబడి వస్తుందని.. అయితే ఈసారి కొద్దిపాటి వర్షాలతో దిగుబడి వస్తుందని పేర్కొన్నారు.

## హెల్మెట్ ధరించకుంటే కఠిన చర్యలు

సోమల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు హెల్మెట్ విధిగా ధరించి ప్రయాణం చేయాలని సోమల ఎస్‌ఐ శివశంకర్ పేర్కొన్నారు. ఆదివారం కలికిరి క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం.. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించుకోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని సూచించారు. అలాగే కొత్త సంవత్సరం శుభాకాంక్షలు పేరిట సైబర్ మోసాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని.. సోషల్ మీడియాలో వస్తున్న ప్రకటనలపై జాగ్రత్తగా ఉండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌సీ నగేశ్, దేవరాజులు, మోహన్‌రెడ్డి, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ సెల్ఫీ ఛాలెంజ్



పొన్నాంగూర్‌లోని సొంత బూత్‌లో సెల్ఫీ ఛాలెంజ్ చేస్తున్న ప్రేమ్‌కుమార్

కుప్పం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతికను అందిపుచ్చుకుని ప్రజా, రాజకీయ అవసరాలకు వినియోగించుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటారు. ప్రస్తుతం పార్టీ సభ్యత్వ నమోదు చివరి దశలో ఉంది. సభ్యత్వ నమోదు ఇక రెండురోజులు మాత్రమే కొనసాగుతుంది. కుప్పం నియోజకవర్గం ఒక దశలో సభ్యత్వంలో రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలువగా.. ఆదివారం నాటికి 6వ స్థానానికి పడిపోయింది. అయితే సభ్యత్వం మాత్రం 2,25,777 మంది ఓటర్లకుగాను 1.21 లక్షలు దాటిపోయింది. ఇందులో 33,987 మంది సభ్యత్వంతో కుప్పం మండలం మొదటి స్థానంలో ఉండగా.. 18,867 మంది సభ్యత్వంతో కుప్పం మున్సిపాలిటీ చివరి స్థానంలో ఉంది. రామకుప్పం 26,846, శాంతిపురం 21,617, గుడుపల్లె 20,060 మంది సభ్యత్వంతో మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఈ దశలో పార్టీ శ్రేణులను ఉత్తేజపరచి సభ్యత్వం ముమ్మరం చేయడానికి ఆయన 'సెల్ఫీ ఛాలెంజ్‌'ను సాధనంగా ఎంచుకున్నారు. నాయకులు, కార్యకర్తలు సభ్యత్వాన్ని నమోదు చేయిస్తూ సెల్ఫీ తీసుకుని తోటివారికి సెల్ఫీ ఛాలెంజ్ విసరమని సూచించారు. 'నా బూతు, నా బాధ్యత' అనే పేరుతో ఎవరి పరిధిలోని బూతుల్లో, ఆ నాయకులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదును బాధ్యతగా చేయించాలని ఆదేశించారు. దీంతో స్పందించిన కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మండలంలోని పొన్నాంగూరులోని తన సొంత పోలింగ్ బూత్ 234 పరిధిలో ఆదివారం యువకులచే పార్టీ సభ్యత్వం చేయించి తోటి నాయకులకు సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె మండల పార్టీ అధ్యక్షులు ఆనంద్‌రెడ్డి, విశ్వనాథనాయుడు, బాబునాయుడులు ఈ ఛాలెంజ్‌ను సహృదయంతో స్వీకరించి ఇతర నాయకులకు ఇవ్వాలని విన్నవించారు. అలాగే కుప్పం పట్టణం 176వ బూత్, 13వ వార్డులో ఆదివారం సభ్యత్వ నమోదు ముమ్మరంగా జరిగింది. టీడీపీ వార్డు అధ్యక్షుడు లోకేశ్, ప్రధాన కార్యదర్శి భరత్, బూత్ కన్వీనర్ మణి, టీడీపీ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్ పాల్గొన్నారు.

## సోమలలో కుక్కల స్వైరవిహారం



సోమల బస్టాండులో వీధి కుక్కలు

సోమల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆదివారం ఉదయం బస్టాండులో వడ్డిపల్లెకు చెందిన కాంతమ్మను వెంటబడిన వీధికుక్కలు తీసుకెళుతున్న చికెన్‌ను లాక్కున్నాయి. ఆమె చేతిని కరవడంతో తీవ్రంగా గాయపడ్డారు. పాఠశాలకు చిన్నారులు ఒంటరిగా వెళ్లలేకపోతున్నారు. వందల సంఖ్యలో వీధి కుక్కలు చేరిపోతుండటంతో ద్విచక్రవాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, పిల్లలు చేతికర్రలతో నడక సాగిస్తున్నారు. అధికారులు స్పందించి వీధికుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## జనసేన బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలి



జనసేనపార్టీ కండువాలు కప్పుతున్న జనసేన నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి

పుంగనూరు రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో జనసేన పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని జనసేన నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని మాగాండ్లపల్లెలో మహిళలు, యువకులు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకోవడంతో వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు విరూపాక్షి, శివకుమార్‌రెడ్డి, పడగాల రమణ, చిన్నరాయల్, నరేంద్రరెడ్డి, రెడ్డిరాయల్, మంజునాథ్, చలపతి, శ్రీనివాసులు, జయపాల్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 5న కాణిపాకంలో వడ్డెర సంకల్ప సభ



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డెర సంఘ నాయకులు

పుంగనూరు రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జనవరి 5న ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో జరిగే వడ్డెర ఎస్టీ సంకల్ప సభను విజయవంతం చేయాలని వడ్డెర సంఘ నాయకులు సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ఉలవలదిన్నెలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వడ్డెరలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. వడ్డెర సంఘ అభివృద్ధి కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. వడ్డెర కులస్తులు, మేధావులు, విద్యార్థులు, మహిళలు అధికసంఖ్యలో సంకల్ప సభకు తరలిరావాలని కోరారు. నాయకులు సుబ్రహ్మణ్యం, సిద్దప్ప, తిమ్మయ్య పాల్గొన్నారు.

### నేడు పులిచెర్లలో చల్లా రామచంద్రారెడ్డి పర్యటన

కల్లూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీలో సోమవారం ఉదయం 9 గంటలకు పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పర్యటిస్తున్నట్లు మండల టీడీపీ నాయకులు ధనం జయనాయుడు తెలిపారు. పంచాయతీ పరిధిలోని మల్లేశ్వరకొండపై వెలసిన మల్లేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి ఆలయ అభివృద్ధిపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.



## వైద్యసేవలు.. అంతంతమాత్రం..!

● పాత ఆసుపత్రిలోనే కొనసాగుతున్న ఆపరేషన్లు ● నూతన భవనానికి అందని ఆక్సిజన్ సరఫరా
● ఏర్పాటు కాని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ● అవస్థలు పడుతున్న రోగులు

పలమనేరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో వంద పడకల ఆసుపత్రి నూతన భవనం సర్వహంగులతో నిర్మించారు. సుమారు 7 నెలల క్రితం ఆసుపత్రి భవనాలను ప్రారంభించినా పాత ఆసుపత్రి భవనంలోనే డాక్టర్లు ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనంలోని ఆపరేషన్ థియేటర్‌కు ఇంకా ఆక్సిజన్ కనెక్షన్ ఇవ్వకపోవడమే ప్రధాన కారణం. పలమనేరులో ఉన్న ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం నూతన ఆసుపత్రి భవనాన్ని నిర్మించింది. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలతో సువిశాలంగా 100 పడకల ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయిలో నిర్మించారు. ఈ నూతన భవనాన్ని గత అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఆసుపత్రి ప్రారంభించి నెలలు గడుస్తున్నా..నేటికీ ఆసుపత్రిలో రోగులకు పూర్తిస్థాయిలో నూతన భవనంలో సేవలు అందించడం లేదు. మూడేళ్ల క్రితం కరోనా సమయంలో ప్రభుత్వం పలమనేరు ఆసుపత్రిలోనూ ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. నూతన ఆసుపత్రి భవనం నిర్మించిన సందర్భంగా అందుకు అవసరమైన ప్రతి వార్డుకు ఆక్సిజన్ అందుబాటులో ఉండేలా మళ్లీ భారీ ఆక్సిజన్ ప్లాంటును ఇక్కడ ఏర్పాటు చేశారు. అయితే ఆసుపత్రి భవనం ప్రారంభించినా.. ఇప్పటివరకు ఆక్సిజన్‌ను కొత్త ఆసుపత్రి భవనంలోని వార్డులకు అనుసంధానం చేయలేదు. నూతన ఆసుపత్రి భవనానికి ఆక్సిజన్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. ఆక్సిజన్ ప్లాంటు నుంచి కొత్త ఆసుపత్రి భవనంలోని అన్ని వార్డులు, పడకలకు ఆక్సిజన్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలంటే కనీసం రూ. 30 లక్షలకు పైగా వ్యయమవుతుందని చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో ఆక్సిజన్ కనెక్షన్లు ఇవ్వలేదని అధికారులు అంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటై 7 నెలలు కావస్తున్నా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటు కాలేదు. దీంతో ప్రభుత్వంపై ఒత్తిడి లేకపోవడం గమనార్హం.



పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న ఆక్సిజన్ ప్లాంట్

నియోజకవర్గ కేంద్రంగా ఉన్న పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి పలమనేరు గంగవరం, బైరెడ్డిపల్లి, పెద్దపంజాణి మండలాల నుంచి క్షతగాత్రులు ఈ ఆసుపత్రికి చికిత్స కోసం వస్తుంటారు. ఇకనైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన ఆసుపత్రి భవనంలోని ఆపరేషన్ థియేటర్‌తో పాటు అన్ని వార్డుల్లోని పడకల కు ఆక్సిజన్ కనెక్షన్ ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

## యూటీఎఫ్ మహాసభలు విజయవంతం చేయాలి



పుంగనూరులో పతాకావిష్కరణ చేస్తున్న నాయకులు

పుంగనూరు రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జనవరి 5 నుంచి 8 వరకు కాకినాడలో జరిగే ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పుంగనూరులో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీగా వెళ్లి ఎన్టీఆర్ సర్కిల్, ప్రైవేటు బస్టాండు మీదుగా ఇందిరా సర్కిల్ చేరుకుని జ్యోతిరావు పూలే, తెలుగు తల్లి, వాల్మీకి మహర్షి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మార్సీ భవనం వద్ద యూటీఎఫ్ పతాకావిష్కరణ చేసి ప్రచారజాత నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ కాకినాడ మహాసభల్లో సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, దేశవ్యాప్తంగావిద్యావేత్తలు పాల్గొంటారని తెలిపారు. విద్యావిధానానికి విఘాతం కలిగించే 117 జీవో రద్దు, ప్రభుత్వ విద్యారంగ బలోపేతం, సీపీఎస్ రద్దు తదితర అంశాలపై చర్చించి తీర్మాణాలు చేయడం జరుగుతుందన్నారు. పుంగనూరు ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు మహాసభలకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సోమశేఖర్‌నాయుడు, మణి, నాయకులు జగన్మోహన్‌రెడ్డి, సి.వెంకటేశ్వరరెడ్డి యాదవ్, ఈశ్వరమహేంద్ర, ఎంవీ రమణ, పార్థసారధి, వీసీ బాబు, చంద్రశేఖరరెడ్డి, రెడ్డెప్ప, శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి, సహదేవయ్య, లోకనాథ్‌రెడ్డి, విజయ్‌కుమార్, సురేంద్రరెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, శంకర్, కృష్ణంరాజు, కవిత, శివకుమారి, గాయిత్రి, స్రవంతి పాల్గొన్నారు.

●పలమనేరు: యూటీఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఆదివారం యూటీఎప్ ప్రచార యాత్ర పుంగనూరు నుంచి పలమనేరుకు చేరుకుంది. ఈ సందర్భంగా యూటీఎప్ కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు తాజుద్దీన్ పతాకావిష్కరణ చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో యూటీఎప్ కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, జిల్లా నాయకులు నిర్మల, ప్రకాష్, కృష్ణమూర్తి, ప్రసన్నకుమార్, బాబు, డివిజన్ నాయకులు ఈశ్వరప్రసాద్, దయానంద, భాస్కరయ్య, గురుమూర్తి, సాలెహా, రామ్మోహన్, షన్ముఖం, రుక్సానాబేగం, వెంకటేశ్వరరెడ్డి, గురునాథం, గౌస్‌భాషా, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



పలమనేరులో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

## భారతీయ సాంప్రదాయాలు గౌరవించాలి



విజేతలను అభినందిస్తున్న లయన్స్ క్లబ్ నోబుల్ ప్రతినిధులు

పుంగనూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విలువైన భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను మరవకుండా గౌరవించాలని లయన్స్‌క్లబ్ నోబుల్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ పి.శివ పేర్కొన్నారు. ఆదివారం పుంగనూరు సమీపంలోని కృష్ణమరెడ్డిపల్లె రోడ్డులోని అక్షర స్కూల్‌లో 34 పాఠశాలల విద్యార్థులతో చిల్డ్రన్స్ ఫెస్టివల్ సంబరాలు-2024 నిర్వహించారు. ఈ సందర్భంగా శ్లోకాలు, శతకాలు, పద్యాలు తదితర 15 రకాలు పోటీలు నిర్వహించగా స్కూల్ ఛాంపియన్‌షిప్‌లో ప్రథమ బహుమతి అక్షర స్కూల్, ద్వితీయస్థానం ఈస్టుపేట ప్రాథమిక పాఠశాల, తృతీయస్థానం జడ్పీ బాలికల పాఠశాలలు అందుకున్నాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు డాక్టర్ సరళ, త్రిమూర్తిరెడ్డి, సురేశ్, మహిపాల్‌రెడ్డి, మణికంఠ, బాలసుబ్రహ్మణ్యం, సరస్వతి, ముత్యాలు, వరదారెడ్డి, రజీఅహ్మద్, శ్రీధర్, రఘుపతి, సతీశ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## పేదలకు సేవలందించడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న నందీశ్వరయ్య

పుంగనూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అభాగ్యులు, పేద ప్రజలకు సేవ చేయడమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ధ్యేయమని పుంగనూరు సంస్థ చైర్మన్ నందీశ్వరయ్య అన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో జరిగిన సమావేశంలోయోగా గురువు వనిత సంస్థకు రూ.లక్ష విరాళం అందించగా.. అందులో రూ.76 వేలు విలువైన ఫ్రీజర్‌బాక్స్‌ను ఆమె వదిన అశ్వతకు మారి జ్ఞాపకార్థం అందించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ కష్టకాలంలో కులమతాలకు అతీతంగా అంతిమ సంస్కరణల కోసం, సేవా కార్యక్రమాలకు సంస్థకు అందిస్తున్న సహకారం, విరాళాలు అభినందనీయమన్నారు. జనవరిలో పుంగనూరులో నిర్వహించే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకునేలా ప్రచారం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఏసీ నారాయణరెడ్డి, పూలత్యాగరాజు, నానబాల గణేశ్, సరస్వతి, ఆర్.హరినాథరెడ్డి, ఎన్.రామనాథం, నరసింహారెడ్డి, బాలాజీ, జగన్మోహన్‌రెడ్డి, మార్లపల్లె హరినాథ్‌రెడ్డి, వెంకటముని, రామనాథం, భార్గవ్, ఉదయ్‌కుమార్, భక్తవత్సలరాజు, పారిజాతం, ద్వారకమ్మ, సుధాకర్ రావు, వెంకటేశ్‌మొదలియార్ తదితరులు పాల్గొన్నారు.

## కొండెక్కిన కొబ్బరి కాయల ధరలు

పాలసముద్రం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో కొబ్బరి కాయలకు డిమాండ్ పెరగడంతో మండలంలో వాటి ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రస్తుతం వంద కొబ్బరికాయల ధర రూ.2000 వరకు పలుకుతోంది. నెల రోజుల క్రితం వరకు వంద కొబ్బరి కాయలు రూ.1500 వరకు ధర పలికింది. ప్రస్తుతం అయ్యప్ప స్వామి భక్తులు శబరిమలైకి వెళుతుండటం, మరో వైపు వరుసగా పెళ్లిళ్ల సీజన్, పండుగల కారణంగా కొబ్బరి ధరలు విపరీతంగా పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. కొబ్బరి తోటలకు తెగుళ్లతో దిగుబడి తగ్గడంతో కాయలకు అనూహ్యంగా డిమాండ్ పెరగడంతో ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పాలసముద్రం మండలంలో సుమారు నాలుగు వేల ఎకరాల్లో కొబ్బరి తోటలు ఉన్నాయి. కొబ్బరి కాయలు ఉన్న రైతు వద్ద వ్యాపారులు ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

## ముఖ్యమంత్రి వస్తున్నారని..!



ఎన్టీఆర్ స్టేడియంలో పొదలు తొలగిస్తున్న అధికారులు

కుప్పం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జనవరి మొదటి వారంలో కుప్పం పర్యటనకు రానున్న నేపథ్యంలో కుప్పంలో అభివృద్ధి పనులు ఊపందుకుంటున్నాయి. కుప్పం పట్టణ పరిధిలోని నందమూరి తారకరామారావు క్రీడా ప్రాంగణంలో ఆదివారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పొదల తొలగింపు కార్యక్రమం జరిగింది. పొదలు, చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేశారు. టీడీపీ నియోజకవర్గ విస్తరణ విభాగం సభ్యుడు కన్నన్ పనులను పరిశీలించారు.

### చెంచమరెడ్డిగారిపల్లెలో లోపించిన పారిశుధ్యం



వీధుల్లో పారుతున్న నీటితో లోపించిన పారిశుధ్యం

రొంపిచెర్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంచమరెడ్డి గారి పల్లె పంచాయతీ కేంద్రంలోని వీధుల్లో నీరు పారుతూ ప్రజలు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వీధుల్లో మురుగునీటి కాలువలు లేకపోవడంతో కుళాయి నీటితో పాటు మురుగునీటి కారణంగా పారిశుధ్యం లోపించింది. దీంతో దోమల బెడద ఎక్కువగా ఉండటంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## సమస్యల పరిష్కారానికి సహకారం
### టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి



టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న నాయకులు

రొంపిచెర్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని సోమల, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను కలిశారు. రొంపిచెర్ల సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్ ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి పనులపై వివరించారు. ఈ సందర్భంగా చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు 50,211 టీడీపీ సభ్యత్వాలు చేశారని, సదుం మండలంలో 1,176, పుంగనూరు పట్టణంలో 5,962, పుంగనూరు రూరల్ 10,703, చౌడేపల్లిలో 7,668, పులిచెర్లలో 8,301, సోమలలో 9,698, రొంపిచెర్లలో 6,708 సభ్యత్వాలు చేశారని.. సభ్యత్వాల నమోదు ముమ్మరం చేయాలని సూచించారు.

## గుంతలమయం.. పుంగనూరు- బైరెడ్డిపల్లె రోడ్డు

● ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు ● రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో తప్పని తిప్పలు

పుంగనూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పుంగనూరు- బైరెడ్డిపల్లె మార్గంలో ప్రయాణికులు గుంతల రోడ్లతో ప్రమాదాల బారిన పడుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా వర్షం నీటితో ముందే రోడ్డుపై ఉన్న గుంతలు మరింత పెద్దవిగా తయారవుతున్నాయి. పుంగనూరు నుంచి బెంగళూరు వెళ్లే ప్రయాణికులకు సమీప దారి కావడంతో అందరూ బైరెడ్డిపల్లె మార్గంలోని ర్యాక్ వ్యాలీ మీదుగా వెళుతుంటారు. వడ్డిపల్లె వద్ద చెన్నై-బెంగళూరు హైవేలో కలుస్తుండటంతో ఈమార్గాన్నే ఎంచుకుంటారు. ప్రధానంగా ప్రముఖ శక్తి ఆలయమైన బోయకొండ గంగమ్మ దర్శనార్థం మొక్కులు తీర్చుకోవడానికి కర్ణాటక ప్రజలు పుంగనూరుకు ఈ మార్గంలోనే అధిక సంఖ్యలో వస్తుంటారు. అలాగే సరుకులు, ఇతర వస్తువుల కోసం కర్ణాటకకు ఇక్కడి ప్రాంతం వారు వెళ్లడం, కర్ణాటక నుంచి వస్తువులు ఈమార్గం నుంచే రావడం జరుగుతుంటాయి. అయితే రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో పాటు కల్వర్టుల వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారింది. పుంగనూరులోని పుంగమ్మచెరువు కట్టమొరవ వద్ద గుంతలు, బురదతో నిండిపోయింది. అలాగే సింగరిగుంట, డాన్‌బోస్కో పాఠశాల వద్ద పెద్దగోతులు పడ్డాయి. ఈమార్గంలో కొంత దూరం డబుల్ రోడ్డు ఉండగా కొన్నిచోట్ల సింగిల్ రోడ్డు ఉంది. పెద్ద గుంతలతో వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ మార్గం అంటేనే హడలిపోతున్నారు. మరికొందరు దూరం ఎక్కువైనా పలమనేరు మీదుగా బోయకొండ, పుంగనూరుకు వస్తున్నారు. ప్రాధాన్యత గల పుంగనూరు-బైరెడ్డిపల్లె మార్గాన్ని అధికారులు మరమ్మతులు చేసి పూర్తిగా డబుల్‌రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.



సింగరిగుంట వద్ద ఏర్పడిన పెద్ద గుంతలు



పుంగమ్మచెరువు వద్ద అధ్వానంగా రోడ్డు



డాన్‌బాస్కో స్కూల్ వద్ద రోడ్డుపై పడిన గుంత

## గో సంరక్షణశాలకు రూ.లక్ష విరాళం


విరాళమిచ్చిన పత్రాన్ని అందిస్తున్న సూపరింటెండెంట్ వాసు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ శాలకు కృష్ణా జిల్లా పెనమలూరుకు చెందిన సీతారామ్‌ప్రసాద్ ఆదివారం రాత్రి రూ.1,00,116 విరాళం అందించారు. విరాళదాతకు స్వామి స్వామి దర్శన ఏర్పాట్లను సూపరింటెండెంట్ వాసు పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పెనుమూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని మాట్లాడుకున్నారు. తమతోపాటు చదువుకుని ఇబ్బందులు ఎదుర్కొంటున్న తోటి స్నేహితురాలి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం చేసి, బహుమతిగా ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. గత ఏడాది ఓ విద్యార్థి చదువుకు లక్ష రూపాయలు వితరణ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మమత, కిషోర్, శ్రీనాథ్, విజయ్ కుమార్‌రెడ్డి, ముని, జ్యోతి ఇతరులు పాల్గొన్నారు.

## ఆయుర్వేద వైద్య శిబిరంలో 150 మందికి చికిత్స


పరీక్షలు చేయించుకుంటున్న రోగులు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం ఆలయ ఆస్థాన మండపంలో ఆదివారం శ్రీవేంకటేశ్వర మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో 150 మంది చికిత్స పొందినట్లు ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరానికి గతంలో కంటే ఎక్కువగా రోగులు విచ్చేసి చికిత్స చేయించుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



గాంధీ విగ్రహం ముందు యూటీఎఫ్ ప్రచార జాత

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని కోరుతూ ఆ సంఘం నాయకులు ఆదివారం గాంధీ విగ్రహ సర్కిల్‌లో ప్రచార జాత చేపట్టారు. యూటీఎఫ్ కార్యాలయంలో పతాకావిష్కరణ అనంతరం గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి కాకినాడలో జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే మహా సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు సురేష్ బాబు, రమణ, సోమశేఖర నాయుడు, మణిగండన్, సుధాకర్‌రెడ్డి, రెహనాబేగం, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

**నగరి:** కాకినాడలో జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న యూటీఎఫ్ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఆదివారం నగరి, నిండ్ర, విజయపురం యూటీఎఫ్ నాయకులు ప్రచారజాత నిర్వహించారు. నగరి ఓంశక్తి ఆలయం నుంచి పీసీఎన్ పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. టీచర్లందరూ ఈ సభలకు హాజరై విజయవంతం చేయాలని నాయకులు మునిరత్నం, మణిగండన్, వంశీకృష్ణ, జగన్నాథం తదితరులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగరి, విజయపురం, నిండ్ర, కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం, పాలసముద్రం మండలాలకు చెందిన యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగ సుబ్బారెడ్డి

చిత్తూరు అర్బన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గానికి ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగ సుబ్బారెడ్డి, కార్యదర్శి కార్యదర్శి రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా సమితి సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా, అంగన్‌వాడీ వర్కర్ల సమ్మె సందర్భంగా కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు జీతాలు పెంచుతామని హామీ ఇచ్చి ఇంత వరకు పెంచలేదన్నారు. కార్మిక వర్గాన్ని నిరాశపరుస్తూ కనీస వేతనం అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతున్నాయని ఆరోపించారు. రైతాంగ సమస్యలపై ఢిల్లీలో పోరాటం చేస్తున్న రైతులపై దాష్టీకాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏఐటీయూసీ ముందుండి కార్మికుల సమస్యలపై పోరాటంచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ నేతలు ప్రేమ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ సన్మానం


వెంకటరత్నంను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

వెదురుకుప్పం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన టీచర్ వెంకటరత్నంకు ఆదివారం కార్వేటినగరం మండలం గంగమాంబాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వెంకటరత్నం ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారని అన్నారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆయనకు శాలువలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుణవతి లోకనాథం నాయుడు, హెచ్ఎం పి.బాబు, పుత్తూరు ఎంఈవోలు బాలసుబ్రహ్మణ్యం, గురుమూర్తి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, ఉపాధ్యాయ సంఘ నాయకులు గురుమూర్తి, గోవిందయ్య, వేణుగోపాల్, మాజీ ఎంఈవో ఆంజనేయులు పాల్గొన్నారు.

## ఆరు నెలలుగా నిండ్ర ఎస్ఐ పోస్టు ఖాళీ

నిండ్ర, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గ పరిధిలోని నిండ్ర పోలీస్ స్టేషన్‌లో ఆరు నెలలుగా ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో మండలంలోని పెండింగ్ కేసులు, శాంతి భద్రతల పరిరక్షణ, గంజాయి, యువత చెడు బాట పట్టకుండా అవగాహన కల్పించడం లాంటి కార్యక్రమాలు చేపట్టాలంటే ఎస్ఐ తప్పనిసరిగా ఉండాలి. ఆరు నెలలుగా విజయపురం ఎస్ఐ నిండ్ర పోలీస్ స్టేషన్‌కు ఇన్‌చార్జి ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపి నిండ్ర పోలీస్ స్టేషన్‌కు రెగ్యులర్ ఎస్ఐని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## బీసీ మంత్రిని కల్సిన టీడీపీ నేత


మంత్రిని కలసిన కోలా జయచంద్ర

వెదురుకుప్పం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ, హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ శాఖా మంత్రి ఎస్.సవితను వెదురుకుప్పం మండలం వేణుగోపాలపురంకు చెందిన టీడీపీ బీసీ దాసరి సాధికార సమితి జిల్లా అధ్యక్షులు కోలా జయచంద్ర ఆదివారం విజయవాడలో కలిశారు. ఈ సందర్భంగా బీసీల అభివృద్ధికి కృషి చేయాలని మంత్రిని ఆయన కోరారు.

## టీడీపీ కార్యకర్త మృతి


మునెమ్మ (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంగరమడుగు గ్రామానికి చెందిన పరదేశి భార్య టీడీపీ కార్యకర్త మునెమ్మ గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆదివారం రాత్రి తన ఇంటిలోనే మృతి చెందింది. ఈమె మృతిపట్ల మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, క్లస్టర్ ఇన్‌చార్జి ధరణీప్రసాద్, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు కోకా ప్రకాష్ నాయుడు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జనార్ధన్ గౌడ్ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## బీజేపీ మండల అధ్యక్షుడిగా వెంకటేశులు


వెంకటేశులుకు నియామక పత్రం అందిస్తున్న రాజేంద్రన్

పాలసముద్రం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండల బీజేపీ అధ్యక్షుడిగా ఆర్.వెంకటేశులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పాలసముద్రంలో గంగాధరనెల్లూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రాజేంద్రన్, ఎన్నికల ఇన్‌చార్జి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడిగా వెంకటేశులును కార్యకర్తలు ఎన్నుకున్నారు. ఆయనకు రాజేంద్రన్ నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహీదాస్, బాలయ్య, ఈశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

## బాబుతోనే రాష్ట్రాభివృద్ధి : టీడీపీ


టీడీపీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న రాజేంద్రరెడ్డి

వెదురుకుప్పం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర వన్నియ కుల క్షత్రియ కార్పొరేషన్ సభ్యుడు రాజేంద్రరెడ్డి అన్నారు. కార్వేటినగరంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు చేయించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదు చేయించుకుని బీమా సదుపాయాలు, ఇతర ప్రయోజనాలు పొందాలన్నారు. టీడీపీ బూత్ కన్వీనర్ దస్తగిరి, డేటా అనాలసిస్ట్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవ చేయడమే లక్ష్యం


బస్సును ప్రారంభిస్తున్న చెన్నకేశవ నాయుడు

గుడిపాల డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): నిరుపేద ఆదుకోవడం, ప్రజాసేవ చేయడమే జీజేఎం చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని నిర్వాహకులు గురజాల చెన్నకేశవ నాయుడు అన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని చెరుకూరుకండ్రిగ, ముటుకూరుపల్లి గ్రామాల ఓం శక్తి భక్తులకు తమిళనాడులోని మేల్ మరువత్తూర్ ఓం శక్తి గుడికి వెళ్లి రావడానికి ఉచితంగా బస్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఇందుకు గాను ఓం శక్తి భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రామభద్రపురం ఉప సర్పంచ్ సరళ వెంకటేష్, గ్రామస్తులు ఈశ్వర నాయుడు, రమేష్, సుబ్రహ్మణ్యం యాదవ్, చంద్రశేఖర్ యాదవ్, ఓం శక్తి భక్తులు పాల్గొన్నారు.

## గుళికల మందు తిని వివాహిత మృతి


తేజ మృతదేహం

బంగారుపాళ్యం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూంపాయనపల్లె పంచాయతీ పాపిశెట్టివారిబావి గ్రామానికి చెందిన రమేష్, భార్య తేజ గత కొన్ని రోజులుగా కుటుంబ కలహాలతో గొడవలు పడేవారు. శనివారం మధ్యాహ్నం మళ్లీ గొడవలు కావడంతో తీవ్ర మనస్థాపం చెందిన తేజ ఇంటిలో ఉన్న గుళికల మందు తినడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తేజ(30) ఆదివారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతు

బంగారుపాళ్యం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు జిల్లా నాయకులు తమ సంఘీభావం తెలిపారు. రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో కలెక్టరేట్ వద్ద జరుగుతున్న ఉద్యోగుల సమ్మెకు ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు విల్వనాథం, జిల్లా నాయకులు కృష్ణమూర్తి, సతీష్ బాబు,పార్ట్ టైమ్ జిల్లా అధ్యక్షుడు మస్తాన్ మద్దతు తెలిపారు.

## మరమ్మతులకు నోచుకోని వంక కాలువ

● రోడ్డుపై పారుతున్న వరద నీరు
● ఇబ్బందుల్లో ప్రజలు


నాగలాపురం రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్‌ఫొటో)

విజయపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలపాకం - ముత్తప్పరెడ్డి కండ్రిగ సమీపంలోని వంక కాలువకు మరమ్మతులు నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు. సంవత్సరాల తరబడి మరమ్మతులు నిర్వహించక పోవడం వలన తేలికపాటి వర్షాలకే వరద నీరు తిరుత్తణి - నాగలాపురం రోడ్డుపై ప్రవహిస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి ఇబ్బంది తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## రహదారిపై కుక్కల స్వైరవిహారం

● కిందపడి గాయాల పాలవుతున్న వాహనదారులు

బంగారుపాళ్యం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కుక్కల బెడదతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. బంగారుపాళ్యం నడిబొడ్డున రహదారిపైనే కుక్కలు తిష్టవేయడంతో అటు వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సుమారు 70 కుక్కల వరకు రోడ్డుపై అటు ఇటు తిరుగుతూ వాహనాలకు అడ్డుగా రావడంతో ద్విచక్ర వాహనదారులు కింద పడి గాయాలపాలవుతున్నారు. ప్రభుత్వాస్పత్రి నుంచి జూనియర్ కళాశాల వరకు వీటి సంచారం అధికంగా ఉంటోంది. రాత్రివేళల్లో వీటి బెడద తట్టుకోలేక పోతున్నామని పలువురు వాపోతున్నారు. బంగారుపాళ్యం, తగ్గువారిపల్లె పంచాయతీ అధికారులు వీటిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


ద్విచక్ర వాహనాలకు అడ్డంగా వెళుతున్న కుక్కలు


చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై తిష్టవేసిన కుక్కలు

## కొండెక్కిన కొబ్బరి కాయల ధరలు


పాలసముద్రంలో రైతు వద్ద నిల్వ ఉన్న కొబ్బరి కాయలు

పాలసముద్రం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో కొబ్బరి కాయలకు డిమాండ్ పెరగడంతో మండలంలో వాటి ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రస్తుతం వంద కొబ్బరికాయల ధర రూ.2000 వరకు పలుకుతోంది. నెల రోజుల క్రితం వరకు వంద కొబ్బరి కాయలు రూ.1500 వరకు ధర పలికింది. ప్రస్తుతం అయ్యప్ప స్వామి భక్తులు శబరిమలైకి వెళుతుండటం, మరో వైపు వరుసగా పెళ్లిళ్ల సీజన్, పండుగల వలన కొబ్బరి ధరలు విపరీతంగా పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. కొబ్బరి తోటలకు తెగుళ్ల వలన ఈ సంవత్సరం దిగుబడి తగ్గడంతో కాయలకు అనూహ్యంగా డిమాండ్ పెరగడంతో ధరలు పెరిగిపోయాయి. పాలసముద్రం మండలంలో సుమారు నాలుగు వేల ఎకరాల్లో కొబ్బరి తోటలు ఉన్నాయి. కొబ్బరి కాయలు ఉన్న రైతు వద్ద వ్యాపారులు ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు తిరుపతి, శ్రీకాళహస్తి, కాణిపాకం, తమిళనాడులోని తిరుత్తణి, చెన్నై వంటి ప్రాంతాలకు కొబ్బరి కాయలను తరలిస్తున్నారు. నిల్వలు తక్కువగా ఉండటం వలన వ్యాపారులు పోటీ పడి కాయలను కొనుగోలు చేస్తున్నారు.

## విద్యుత్ ఉపకేంద్రం తనిఖీ


విద్యుత్ ఉపకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

యాదమరి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జోడిచింతల వద్ద గల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉపకేంద్రంలో రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సేవలు అందించాలని ఆదేశించారు. ఆయనవెంట ఏపీఎస్పీడీసీఎల్ ఏడీఈ కొండయ్య, ఏఈ గుర్రప్ప, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తి ప్రపత్తులతో రుద్రాభిషేకం

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా సాయిలింగేశ్వర స్వామికి భక్తులు భక్తి ప్రపత్తులతో రుద్రాభిషేకం నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు ఉచితంగా పూజా ద్రవ్యాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థాన్ నిర్వాహకులు, సత్యసాయి సేవా సమతి, భజనమండలి, బాలవికాస్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి పూజలు


సంతపేటలో అయ్యప్ప స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్ప స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో సంతపేట మెయిన్ బజారులో ఆదివారం అయ్యప్ప స్వామి పూజలు వైభవంగా జరిగాయి. అయ్యప్ప స్వామిని ప్రత్యేకంగా అలంకరించి రథంపై అధిష్టింపజేసి పురవీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.

## వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



పెనుమూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కావూరివారిపల్లి వద్ద వెలసిన పార్వతీపరమేశ్వర రుణమోజనేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మాస శివరాత్రిని పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయమే స్వామివారికి వివిధరకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయం వెలుపల భక్తుల సమక్షంలో జరిగిన కల్యాణోత్సవానికి కావూరివారిపల్లి గ్రామానికి చెందిన దొరస్వామి నాయుడు దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త కృపానందంపిళ్లై, నిర్వాహకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో నగరి కవి కవితాగానం


అవార్డు తీసుకుంటున్న నగరి కవి

నగరి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో నగరి మండలంలోని ముడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ తన ప్రతిభ కనబరిచి పలువురి అభినందనలు పొందారు. ఈ కవి సమ్మేళనంలో పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై ఆయన చేసిన కవితాగానం అందరినీ అలరించింది. ఈ కవిత ఉత్తమ రచనకు గాను పర్యావరణ కవి అనే బిరుదుతో నిర్వాహకులు ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంఈఓలు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌ను అభినందించారు.

## హైందవ శంఖారావంపై ప్రచారం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శేషాద్రికుమార్

వెదురుకుప్పం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): జనవరి 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావంపై ఆదివారం వెదురుకుప్పం మండలంలో బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు విస్తృత ప్రచారం చేశారు. ఈ క్రమంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రచార వాహనంలో గ్రామాల్లో హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్వేటినగరం ఖండ సహా కన్వీనర్ రోహిత్‌రాజు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్, బీజేపీ నేతలు కానాల విశ్వనాథరెడ్డి, బోడిరెడ్డి అశోక్, నాయకులు పాల్గొన్నారు.

## పేదలకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు అర్బన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఆదివారం చెన్నమ్మగుడిపల్లె గాస్పెల్ చర్చిలో పాస్టర్ రమేష్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాస్టర్ ప్రతి ఏడాది పేదలకు అండగా ఉండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు రేవా జోబిన్, జాషువా, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత నేత్ర వైద్యశిబిరం



కంటి రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాములగుడి వీధి జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి అరవింద నేత్ర వైద్యశాల వైద్యుల సహకారంతో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో 93 మంది రోగులకు పరీక్షలు నిర్వహించగా, వారిలో 27 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరందరికీ జైన్ సంఘం ఆధ్వర్యంలో వైద్యం చేయించనునట్లు సంఘం అధ్యక్షులు సుభాష్ జైన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌చంద్, విశాల్, సాగర్, ప్రవీణ్, లలిత్, జ్యోతి, ఎవంత్, కమలేష్, అమిత్‌జైన్లు పాల్గొన్నారు.

## 5న కాణిపాకంలో వడ్డెర సంకల్ప సభ

పుంగనూరు రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జనవరి 5న ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో జరిగే వడ్డెర ఎస్టీ సంకల్ప సభను విజయవంతం చేయాలని వడ్డెర సంఘ నాయకులు సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ఉలవలదిన్నెలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వడ్డెరలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. వడ్డెర సంఘ అభివృద్ధి కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. వడ్డెర కులస్తులు, మేధావులు, విద్యార్థులు, మహిళలు అధికసంఖ్యలో సంకల్ప సభకు తరలిరావాలని కోరారు. నాయకులు సుబ్రహ్మణ్యం, సిద్దప్ప, తిమ్మయ్య పాల్గొన్నారు.

## తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వాలు చొరవ చూపాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తెలుగు భాషాభిమానులు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తెలుగు భాషాభివృద్ధికి చర్యలు చేపట్టాలని తెలుగు భాషాభిమానులు డిమాండ్ చేశారు. ఆదివారం తెలుగు రచయితల సంఘం కార్యాలయంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధి చేయాలని ప్రభుత్వాలకు పోస్ట్ కార్డు ఉద్యమం తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కోటేశ్వరన్, మునీంద్ర, రోహిత్, ముబారక్, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.